క్లుప్తంగా

కాంగ్రెస్‌వైపే ప్రజల మొగ్గు

● కడియం కావ్యకు 5,178 ఓట్ల ఆధిక్యం

ఐనవోలు : మండలంలోని ఓటర్లు కాంగ్రెస్ పార్టీ వైపే మొగ్గు చూపారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్యకు వర్ధన్నపేట శాసనసభ పరిధిలోని ఐనవోలు మండలంలో గల 16 గ్రామాలు 35 పోలింగ్ బూత్‌లలో 11,907 ఓట్లు పోలయ్యాయి. కాగా బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్‌కు 6,729, బీఆర్‌ఎస్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌కు 3,471 ఓట్లు రాగా మిగిలిన 39 మంది అభ్యర్థులకు 1,596 ఓట్లు మాత్రమే వచ్చాయి. అదేవిధంగా 126 మంది ఓటర్లు నోటాకు ఓటు వేశారు. కాగా మండల వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కడియం కావ్య సమీప బీజేపీ అభ్యర్థి అరూరి రమేశ్ కంటే 5,178 ఓట్ల ఆధిక్యం సాధించారు.

క్షేత్రస్థాయి సమస్యలపై ఉద్యమించాలి

న్యూశాయంపేట: రైతుల క్షేత్రస్థాయి సమస్యలపై ఉద్యమించాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.చుక్కయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని సుందరయ్య భవన్‌లో మొమిడి శ్రీకాంత్, బండి పర్వతాలు అధ్యక్షతన సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం గురువారం జరిగింది. రైతాంగ సమస్యలపై జిల్లాలోని ప్రభుత్వ అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు. జూలై చివరి నాటికి మండల సదస్సులు నిర్వహించాలని, అన్ని మండలాల్లో క్షేత్రస్థాయి సమస్యలపై చర్చించాలని సూచించారు. సమావేశంలో శ్రీనివాస్, శంకర్‌రావు, మోహన్‌రావు, నారాయణరెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ సెంటర్: డీఎడ్, డీపీఎస్‌ఈ కోర్సుల్లో ప్రవేశాలకు జూలై 7న నిర్వహించే డీఈఈ సెట్–2024కు శనివారం నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వరంగల్ డీఈఓ వాసంతి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 50శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://deecet.cdse.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

అన్నదానం

హన్మకొండ అర్బన్: అమావాస్య సందర్భంగా శ్రీభద్రకాళి వీరభద్ర సేవా సమితి ఆధ్వర్యంలో బాలసముద్రంలోని ప్రెస్ క్లబ్ ఎదుట గురువారం అన్నదానం చేసినట్లు సమితి సభ్యులు తెలిపారు. గత ఐదు నెలలుగా సమితి ఆధ్వర్యంలో ప్రతినెలా అమావాస్య రోజున సుమారు 200 మందికి పైగా అన్నదానం చేస్తున్నట్లు వివరించారు. దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇస్తే మరింత మందికి అన్నదానం చేసే అవకాశం ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు శ్రీధర్, ధనుంజయ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

లారీ ఓనర్ల మధ్య వర్గపోరు

ఖిలా వరంగల్: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్‌లో లారీ ఓనర్లు, కార్యవర్గ సభ్యుల మధ్య జరుగుతున్న వర్గపోరు తీవ్రస్థాయికి చేరింది. కమిటీ ఎన్నికై రెండేళ్లు పూర్తి చేసుకున్నా.. నూతన కమిటీ ఎన్నికపై దృష్టి సారించడం లేదని, సీరియల్ విధానంపై ప్రశ్నిస్తే కార్యవర్గం దాడులకు తెగబడుతోందని ఓనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న చిన్న విషయాల్లో లారీ ఓనర్లు పరస్పరం దాడులకు దిగుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల లారీ సీరియల్ విధానంలో లారీ ఓనర్లు, కార్యవర్గం మధ్య గొడవలు జరగగా ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మరువక ముందే తాజాగా వరంగల్ – నర్సంపేట రోడ్డులోని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ పార్కింగ్ స్థలంలో సీరియల్ విధానంపై ప్రశ్నించిన ఓ లారీ ఓనర్‌పై కార్యవర్గ సభ్యులు, అనుచరులు గురువారం దాడికి పాల్పడినట్లు తెలిసింది. క్షతగాత్రుడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

ఒకపూట పని విధానాన్ని కల్పించాలి



హన్మకొండ: ఉష్ణోగ్రతలు ఇంకా తగ్గనందున మున్సిపల్ కార్మికులకు రెండు పూటల పనిని నిలిపివేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య డిమాండ్ చేశారు. హనుమకొండలో 57, 58వ డివిజన్లలో విధులు నిర్వహిస్తున్న మున్సిపల్ కార్మికులతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత తగ్గకున్నా మున్సిపల్ కార్మికులతో రెండు పూటలు ఎలా పని చేయిస్తారని ప్రశ్నించారు. ఈక్రమంలో మున్సిపల్ అధికారుల తీరును ఆయన ఖండించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో రెండు పూటల పని విధానాన్ని తీసివేసి ఒక్కపూటనే 8 గంటలు పని చేయిస్తుంటే వరంగల్ మహానగర మున్సిపల్ కార్పొరేషన్‌లో రెండు పూటలు పని చేయిస్తుండడంతో కార్మికులు అనారోగ్యానికి గురవుతున్నారని అన్నారు. ఒక పూట పని విధానాన్ని అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బరుపట్ల మహేష్ పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

● బడీడు పిల్లలను బడిలో చేర్పించాలి
● 'బడి బాట' కార్యక్రమంలో తల్లిదండ్రులకు అవగాహన
● ఇంటింటి ప్రచారంలో ఉపాధ్యాయులు



ఐనవోలు: బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు



శాయంపేట: బడిబాట ర్యాలీ నిర్వహిస్తున్న, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది

దామెర : బడీడు పిల్లలను తల్లిదండ్రులు బడిలో చేర్పించాలని దామెర ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లకావత్ రాజేష్ కుమార్ తెలిపారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో గురువారం ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5–14 సంవత్సరాల వయసు కలిగిన బాల, బాలికలను బడికి పంపే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుందని పేర్కొన్నారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అందించడం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషిచేయడం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సబిత, పాఠశాల చైర్మన్ మల్లిక, ఉపాధ్యాయులు నవీన్, కమలాకర్, ఉమ, మహేశ్వర్, కవిత, కళావతి, విజయలక్ష్మి, అంగన్‌వాడీ సిబ్బంది, సీఆర్పీలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లోనే క్రమశిక్షణతో కూడిన విద్య

శాయంపేట : సర్కారు బడుల్లోనే విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందజేస్తున్నామని ప్రభుత్వ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు, శ్రీలత తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయా పాఠశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై, విద్యార్థులు సాధించిన ర్యాంకులతో ముద్రించిన కరపత్రాలను పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఫ్లెక్సీలతో బస్టాండ్ కూడలిలో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, మధ్యాహ్న భోజనం అందించడమే కాక క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో విద్యను బోధిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలు చేసే ఆర్బాటాలకు మోసపోకుండా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు.

అంగన్‌వాడీలో బడిబాట

మూడు నుంచి 5ఏళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించాలని కోరుతూ అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఎల్‌కేజీ, యూకేజీ, వర్క్ బుక్‌లతో పాటు ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. పిల్లలకు పాలు, కోడిగుడ్లతో పాటు పౌష్టికాహారాన్ని ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శ్వేత, జ్యోత్స్న, కవిత, పుష్ప, రమ, ఆయాలు స్వరూప, సరోజన, తల్లులు, గర్భిణులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



దామెర: బడిబాట ర్యాలీలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, అంగన్‌వాడీలు

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

ఐనవోలు : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతోందని మండల వ్యాప్తంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు అభిప్రాయపడ్డారు. గురువారం బడిబాట కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆయా గ్రామాల్లో ఫ్లెక్సీతో పర్యటించి ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను ఉపాధ్యాయులు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో అనేక మార్పులు తీసుకొచ్చిందని, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను ఏర్పాటు చేసిందన్నారు. మధ్యాహ్న భోజనంలో నాణ్యత పెంపొందించి పౌష్టికాహారం అందిస్తోందని తెలిపారు. ఉచిత పుస్తకాలు, నోట్ బుక్‌లు, వర్క్‌బుక్‌లతో పాటు దుస్తులను అందజేస్తోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులను చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. బడీడు పిల్లలను బడిలో చేరుస్తామని, విద్యార్థుల భవిష్యత్‌కై కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పైపులైన్‌కు మరమ్మతు



పైపులైన్‌కు మరమ్మతు చేస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

శాయంపేట : మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గల తాగునీటి వాటర్ ట్యాంక్ పైపులైన్‌ను గురువారం అధికారుల పర్యవేక్షణలో మరమ్మతు చేశారు. 'పైపులైన్ లీకేజీతో తాగునీటి వృథా' అనే కథనాన్ని ఈ నెల 2న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే. ఈ కథనానికి స్పందించిన గ్రామ స్పెషల్ ఆఫీసర్, తహసీల్దార్ సుభాషిణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్, పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, మిషన్ భగీరథ కాంట్రాక్టర్‌తో కొత్త పైపు తెప్పించి సిబ్బందితో బిగించారు. లీకేజీ అయిన పైపును డమ్మీ చేశారు. ఏడాదిగా లీకేజీ అయిన పైపు ఎట్టకేలకు మరమ్మతు కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కాలనీ బోర్డుల ఏర్పాటు

హన్మకొండ అర్బన్: బాలసముద్రం కాలనీ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో కాలనీలోని పలు రోడ్లలో కాలనీ బోర్డులను ఏర్పాటు చేసినట్లు కాలనీ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నామిరెడ్డి సీతారాంరెడ్డి, గుర్రాల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. కమిటీ సొంత ఖర్చుతో ఈ బోర్డులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కాలనీలో రోజురోజుకు పెరుగుతున్న కమర్షియల్ కాంప్లెక్స్‌లు, ఆస్పత్రుల నిర్మాణం వల్ల కాలనీవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులను కోరారు. కాలనీలో డ్రెయినేజీ, పార్కులను అభివృద్ధి చేయాలని కోరారు. జి.భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయించొద్దు

● తహసీల్దార్ ఏ.వీ.భాస్కర్

పరకాల : పట్టణంలోని ఎరువులు, విత్తన వ్యాపారులు రైతులకు అధిక ధరలకు విత్తనాలను విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తహసీల్దార్ ఏ.వీ. భాస్కర్ హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశాల మేరకు పరకాల పట్టణంలోని విత్తనాల దుకాణాలను రెవెన్యూ, వ్యవసాయ శాఖ మండల అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లను, బిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భాస్కర్, మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ మార్కెట్‌లో రైతులకు సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని ఏలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులకు అధిక ధరలకు విత్తనాలు విక్రయించిన, నకిలీ విత్తనాలు అమ్మిన లైసెన్స్‌లు రద్దు చేయడంతో పాటు కఠినమైన తప్పవని హెచ్చరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐనవోలు : ఐనవోలు, వెంకటాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో చెట్లకొమ్మల కత్తిరింపు, లైన్ మరమ్మతుల కారణంగా నేడు (శుక్రవారం)విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ పద్మ గురువారం ప్రకటనలో తెలిపారు. ఒంటిమామిడిపల్లి ఫీడర్ పరిధిలోని ఒంటిమామిడిపల్లి, నాగపురంలోని ఇళ్లు, వ్యవసాయ బావులు, పౌల్ట్రీఫాంలకు, అదే విధంగా వెంకటాపూర్‌లోని ఇళ్లు, వ్యవసాయ బావులకు నేటి ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని తెలిపారు. రైతులు, గ్రామస్తులు, వినియోగదారులు సహకరించాలని ఆమె కోరారు.

'నీట్'లో విద్యార్థుల ప్రతిభ



ఆత్మకూరి చరిష్మా



బొల్లెపల్లి అక్షయ

ఐనవోలు : మెడిసిన్ చదవడానికి ఆల్ ఇండియా లెవల్‌లో నిర్వహించిన నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ప్రవేశ పరీక్షలో ఐనవోలు మండలంతో పాటు పంథిని గ్రామానికి చెందిన విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఐనవోలు గ్రామానికి చెందిన బొల్లెపల్లి ప్రదీప్–మాలతీ కుమార్తె అక్షయ ఇటీవల విడుదలైన నీట్ పరీక్షలో 720 మార్కులకు గాను 613 మార్కులు సాధించి ఆల్‌ఇండియా లెవల్‌లో 65,976 ర్యాంకు సాధించింది. అదేవిధంగా పంథిని గ్రామానికి చెందిన ఆత్మకూరి మురళీకృష్ణ–ప్రణవిల కుమార్తె చరిష్మా 720 మార్కులకు గాను 604 మార్కులు సాధించి ఆల్ ఇండియా లెవల్‌లో 76,067 ర్యాంకు సాధించింది. కొద్ది రోజుల్లో రాష్ట్ర ర్యాంకు వెలువడనుండగా తెలంగాణలో వైద్య సీట్లు పెరిగిన నేపథ్యంలో తప్పనిసరిగా ఉచిత సీటు వస్తుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ బడి.. అమ్మ ఒడి లాంటిది

మడికొండ: ప్రభుత్వ బడి.. అమ్మ ఒడి లాంటిదని, ఎలాంటి ఒత్తిడిలేని స్వేచ్ఛ పూరిత వాతావరణంలో ఆటపాటలతో కూడిన బోధన ఉంటుందని మడికొండ ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ మల్లారెడ్డి వివరించారు. బడిబాట కార్యక్రమాన్ని పాఠశాలలో గురువారం ర్యాలీని ప్రారంభించి ఆయన మాట్లాడారు. బడీడు పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. విశాలమైన తరగతి గదులు, క్రీడా స్థలం, ఉచిత యూనిఫాం, వారానికి మూడు రోజులపాటు కోడిగుడ్లతో మధ్యాహ్న భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. ప్రైవేట్ పాఠశాలలు వద్దు ప్రభుత్వ పాఠశాలే ముద్దు అని సూచించారు. ఉన్నత విద్యనభ్యసించిన ఉపాధ్యాయులతో ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యబోధన ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ ఎం.అరుణ, ఉపాధ్యాయులు కోమల్‌రెడ్డి, రమేష్, వేణుగోపాల్, అరుణ, కమల, సరిత, అంగన్‌వాడీ టీచర్లు వెంకటలక్ష్మి, రజిత, మల్లీశ్వరి, రాజమణి, లలిత, మంజుల, కవిత, తదితరులు పాల్గొన్నారు.



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, తదితరులు

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ



పరామర్శిస్తున్న మార్నేని రవీందర్‌రావు

ఐనవోలు : మండల కేంద్రానికి చెందిన వడిచర్ల కొమురమ్మ గురువారం అనారోగ్యం మృతిచెందింది. విషయం తెలుసుకున్న డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు ..కొమురమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసి పరామర్శించారు. చైర్మన్ వెంట జన్ను కుమారస్వామి, తండా వెంకన్న, బొల్లపల్లి పరమేశ్ తదితరులు ఉన్నారు.

హైవేపైనే లారీల పార్కింగ్



ఆత్మకూరు శివారులో హైవేపై నిలిపిన లారీలు

● ప్రమాదకరమైనా మారని తీరు
● పార్కింగ్‌కు ప్రత్యేక స్థలం కేటాయించాలి

ఆత్మకూరు : మండలపరిధిలోని 163 జాతీయరహదారిపై నిత్యం లారీలు ఇష్టారీతిలో పార్కింగ్ చేయడం వల్ల వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. లారీల పార్కింగ్ వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోగొట్టుకున్న సంఘటనలు చోటుచేసుకున్నాయి. ఇంత జరుగుతున్నా లారీల పార్కింగ్ వ్యవహారంపై పట్టించుకునే వారు కరువయ్యారు. ఏటూరునాగారం, మంగపేట తదితర ప్రాంతాలు, భూపాలపట్నం నుంచి ఇసుక లారీలు అధికంగా ఈ హైవేపై ప్రయాణిస్తుంటాయి. అలాగే ప్రమాదమని తెలిసినా పార్కింగ్ చేస్తున్నారు. పార్కింగ్ స్థలాలు లేక రోడ్లపైనే లారీలు నిలుపుతున్నారు. కొంతకాలం క్రితం మండలంలోని గుడెప్పాడ్ వద్ద ఆగిఉన్న లారీని కారు ఢీకొన్న సంఘటనలో ఓ చిన్నారి ప్రాణాలు కోల్పోయింది. జాతీయ రహదారులపై వెళ్లే లారీల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా అధికారులు కృషిచేయా లి. మండలకేంద్రం శివారులో గుడెప్పాడ్, కటాక్షపూర్ సమీపంలో ఎక్కువగా లారీలు నిలుపుతున్నారు. లారీల పార్కింగ్ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

వ్యాపారమయంగా విద్యారంగం



సమావేశంలో మాట్లాడుతున్న మొగిలివెంకటరెడ్డి

కేయూ క్యాంపస్: విద్యను వ్యాపారమయం చేస్తూ అధిక ఫీజుల వసూలుకు తెగబడుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్య తీసుకోవాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలివెంకటరెడ్డి డిమాండ్ చేశారు. కాకతీయ యూనివర్సిటీలోని దూరవిద్య కేంద్రం సెమినార్ హాల్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే నుంచే విద్య వాపారానికి ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యజమాన్యాలు తెరలేపాయని విమర్శించారు. ఇంటర్నేషనల్, పబ్లిక్, సీబీఎస్సీ పేర్లతో రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ, పుస్తకాలు, స్కూల్ యూనిఫాం పేరుతో అధికంగా డబ్బులు వసూలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈక్రమంలో రెగ్యులరేటరీ కమిటీని ఏర్పాటుచేసి ఫీజులను నియంత్రించాలని ప్రభుత్వానికి సూచించారు. విద్యా హక్కుచట్టం కింద ప్రతీ పాఠశాలలో 25శాతం సీట్లు పేదల కోసం కేటాయించాలని కోరారు. సమావేశంలో పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు రంజిత్‌కుమార్, కేయూ ప్రధాన కార్యదర్శి మహేష్, బాధ్యులు వంశీకుమార్, గణేష్, సాయిచంద్, దేవేందర్, గోవర్ధన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి



మామునూరు: వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, వరంగల్ ట్రాఫిక్ ఆర్‌ఎస్సై (ఇన్‌స్ట్రక్టర్) పూర్ణచంద్రారెడ్డి సూచించారు. ఎన్‌సీసీ శిక్షణ శిబిరంలో భాగంగా ఖిలా వరంగల్ మండలం మామునూరు జవహర్ నవోదయ విద్యాలయంలో 8వ బాలిక బెటాలియన్ వరంగల్ డిప్యూటీ కమాండెంట్ రేవతి ప్రభాకరన్ ఆధ్వర్యంలో ఈనెల 1నుంచి జరుగుతున్న ఎన్‌సీసీ శిబిరం గురువారం ఆరవ రోజుకు చేరింది. ముఖ్యఅతిథిగా వారు హాజరై మాట్లాడారు. మద్యం తాగి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడపడం ప్రమాదకరమని హెచ్చరించారు. కారు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. అనంతరం ఎన్‌సీసీ కేడెట్లకు ట్రాఫిక్ రూల్స్‌పై ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కమాండెంట్ రవీంద్రకుమార్ రవి, రమణరావు, కె.స్వప్న, సుజితాదేవి, గాయత్రి రమావత్ పాల్గొన్నారు.

సెక్యులరిజాన్ని కాపాడుకుందాం



ప్రార్థన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

కాజీపేట రూరల్: సెక్యులరిజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాజీపేట దర్గాను ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి ఆమె గురువారం సాయంత్రం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి దర్గా పీఠాధిపతి, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ ఖుస్రుపాషా స్వాగతం పలికి దర్గా వద్దకు తోడ్కొని వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేయించారు. అనంతరం కడియం కావ్య విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో కులమతాలకు అతీతంగా అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అన్ని మతాల వారు ఐక్యంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్పొరేటర్లు విజయశ్రీ రజాలీ, పుర్కాన్, మాజీ కార్పొరేటర్ అబుబక్కర్, నాయకులు సింగారపు రవి, యూనిస్, అజీజ్, అబ్దుల్ పాల్గొన్నారు.

భద్రకాళి దేవాలయంలో ఎంపీ కావ్య పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని వరంగల్ ఎంపీ కడియం కావ్య గురువారం సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం, ఆమెకు ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తీర్థప్రసాదాలు, శేషవస్త్రాలు అందజేసి మహాదాశీర్వచనం చేశారు.

గొప్పనేత రాజేశ్వరరావు



రాజేశ్వర్‌రావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

సమసమాజ నిర్మాణం కోసం ఉద్యమించిన గొప్పనేత చండ్ర రాజేశ్వర్‌రావు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి కొనియాడారు. పార్టీ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి చండ్ర రాజేశ్వర్‌రావు జయంతి ఉత్సవాలను హనుమకొండలోని బాలసముద్రం సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు కరుణాకర్, శ్రీనివాస్, ఎల్లేష్, ఎం.భిక్షపతి, కర్రె లక్ష్మణ్, రాజు, వెంకటరమణ, సంతోష్, శ్రీనివాస్, సారంగపాణి, తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేట: దున్నే వాడికే భూమి కావాలని, భూసామ్య దోపిడీకి వ్యతిరేకంగా అంతరాలు లేని

విత్తనాలు విత్తాం.. నీరు లేదు

హసన్‌పర్తి: చెరువులు ఎండిపోయాయి.. కాల్వల్లో నీరు లేదు.. బావుల కింద విత్తనాలు విత్తాం.. కరెంట్ మాత్రం ఇవ్వడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్లితే నాగారం గ్రామంలోని ఎస్‌ఎస్ 45 ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలో సుమారు 25 మోటారు కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం ఆ ట్రాన్స్‌ఫార్మర్ పరిధిలోని రైతులు వారం రోజుల క్రితం విత్తనాలు విత్తారు. అనంతరం నీరు రాకపోవడంతో ట్రాన్స్‌ఫార్మర్ చెడిపోయిందని గ్రహించారు. దాంతో వారం రోజులుగా నీరు లేక విత్తనాలు మాడిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతు చేయాలని విన్నవించినా అధికారులు పట్టించుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై ఎమ్మెల్యే నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

'ఎంపీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టారు'

న్యూశాయంపేట: ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడిన బీజేపీకి ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బుర్రి ప్రసాద్ విమర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు సారంపెల్లి వాసుదేవరెడ్డి అధ్యక్షతన హనుమకొండ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం విస్తృత స్థాయి సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా బుర్రి ప్రసాద్ మాట్లా డుతూ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలని, గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలన్నారు. ఈనెల 10వ తేదీన హైదరాబాద్‌లో జరగనున్న ఉపాధి కూలీల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు జి.రాజుల రాములు, రాఘవులు, భిక్షపతి, స్వరూప, సురేందర్, శ్రీధర్, రజిత, అనిషా, జయక్క, పద్మతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
వరంగల్ అర్బన్:
9951602875 9553955722
9010299096
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆర్. రమేష్ (S.R) : 9441557565 (ఎల్కతుర్తి)
కె. సుధాకర్ (A.C.O) : 9177258410 (హన్మకొండ)